

కరూర్ దుర్ఘటనకు కారణం

విజయ్ ఆలస్యమే!

- చెప్పిన సమయం కన్నా 7 గంటలు లేటు
- ఎక్కడా భద్రతా లోపాలు లేవు
- పోలీసు హెచ్చరికలు బేఖాతరు
- శాసనసభలో సీఎం స్టాలిన్ ప్రకటన



కరూర్ దుర్ఘటనపై శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందటానికి ఆ పార్టీ నాయకుడు ఏడు గంటలు ఆలస్యంగా రావటమే కారణమని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. బుధవారం ఉదయం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కరూరులో జరిగిన దుర్ఘటన రాష్ట్రంలోని ప్రజలందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆ దుర్ఘటనలో మృతిచెందిన 41 మంది కుటుంబాలకు సభాముఖంగా తన ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నానన్నారు. కరూర్‌లో రోడ్‌షో జరిపేందుకు టీవీకే స్థానిక నాయకులు ముందుగా అడిగిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది అధికంగా ఉంటుందనే పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. సెప్టెంబర్ 25న లైట్‌హౌస్ కార్నర్, ఉళవర్ సంత (రైతు బజార్) ప్రాంతాల్లో రోడ్ షోకు అనుమతి కోరారని, ఆ ప్రాంతాల్లో భద్రత కల్పించడం కష్టమని పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. చివరకు టీవీకే కరూర్ వెస్ట్ జిల్లా కార్యదర్శి కోరిక మేరకు 11 నిబంధనలతో వేలుచ్చామిపురం వద్ద రోడ్‌షోకు అనుమతించినట్లు చెప్పారు. కరూర్ రోడ్‌షోకు పటిష్టమైన భద్రత కల్పించలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, రెండు రోజుల క్రితం అక్కడ అన్నాడీఎంకే నేత ఈపీఎస్ రోడ్‌షో ప్రశాంతంగా ముగిసిందని, ఆ రోడ్‌షోకు సుమారు 300 మంది పోలీసులతో భద్రత కల్పించామని గుర్తు చేశారు. అదే సమయంలో సెప్టెంబర్ 27 రాత్రి జరిగిన టీవీకే రోడ్‌షో సందర్భంగా కరూరు జిల్లా ఎస్పీ నాయకత్వంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, ముగ్గురు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 18 మంది సీఐలు, 75 మంది ఎస్ఐలు, సాయుధ దళాలు సహా 5 వందల మందికి పైగా పోలీసులతో బందోబస్తు కల్పించినట్టు తెలిపారు. అంతే కాకుండా పొరుగు జిల్లాల నుండి ఓ ఎస్పీ, ఇద్దరు సీఐలు, 89 మంది ఎస్ఐలు, 60 మంది సాయుధ దళ కానిస్టేబుళ్లు, టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 20 మంది కానిస్టేబుళ్ల సహా 91 మందితో భద్రతను పెంచామని స్టాలిన్ వివరించారు. రోడ్‌షోకు సుమారు 10 వేల మంది దాకా వస్తారని టీవీకే నిర్వాహకులు పోలీసు ఉన్నతాధికారులకు తెలిపారని, అయితే టీవీకే నేత ప్రయాణించిన వాహనాన్ని వెంబడిస్తూ వేల సంఖ్యలో జనాలు వేలుచ్చామిపురం చేరుకోవటంతో తొక్కిసలాట జరిగాయని వివరించారు.

పొంతనలేని ప్రకటనలు...

పార్టీ నాయకులు టీవీకే నేత సెప్టెంబర్ 27 మధ్యాహ్నం 3 నుండి రాత్రి 10లోగా రోడ్‌షోలో పాల్గొంటారని అధికారికంగా ప్రకటించారని, కానీ ఆ తరువాత ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మధ్యాహ్నం 12 గంటలకే విజయ్ వేలుచ్చామిపురానికి రానున్నారని మీడియా సమావేశంలో ప్రకటించడంతో ఉదయం పది గంటల నుండే ఆ ప్రాంతంలో రద్దీ అధికమైందన్నారు. పార్టీ నేత చెన్నై నుంచి ఉదయం 8.40 గంటలకు బయలుదేరి ఉదయం 9.25 గంటలకు తిరుచ్చి చేరుకున్నారని, అక్కడి నుండి బయలుదేరి నామక్కల్ రోడ్‌షోలో పాల్గొని రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాతే కరూరుకు వచ్చారని, మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కావాల్సిన రోడ్‌షో ఏడు గంటలు ఆలస్యంగా జరిగిందన్నారు. ఈ తీవ్రమైన జాప్యమే తొక్కిసలాటకు దారితీసిందని పేర్కొన్నారు. టీవీకే నేత తన ప్రసంగాన్ని ప్రారంభించడానికి ముందు పోలీసులు పటిష్టమైన భద్రత కల్పించారని వారికి సెల్యూట్ చేసిన తర్వాత జనాన్ని ఉద్దేశించి మాట్లాడారన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ రోడ్‌షో జరిపినా ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడం ఆనవాయితీ అని, కరూర్‌లో టీవీకే నిర్వాహకులు ఉదయం 10 నుంచి గుమికూడిన ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించలేదని,ఆహారం పంపిణీ చేయలేదని, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయలేదని, అందువలనే మహిళలు ఆ చోట నుండి కదల్లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. టీవీకే రోడ్‌షోకు ముందు అదే ప్రాంతంలో ఈపీఎస్ పాల్గొన్న రోడ్‌షోకు 12 వేల నుండి 15 వేల మందివరకూ హాజరయ్యారని, ఆ సభకు 137 మంది పోలీసులు, 30 మంది హోంగార్డులే భద్రతా విధులు నిర్వర్తించారని,పార్టీ శ్రేణులు సభకు వచ్చిన వారికి కనీస సదుపాయాలు సమకూర్చడంతో ఆ సభ ప్రశాంతంగా ముగిసిందన్నారు. కరూరు జిల్లా సరిహద్దు ప్రాంతం తవిట్టుపాళయం చెక్‌పోస్ట్ ప్రాంతం వద్ద ఓ కార్యక్రమంలో పాల్గొని టీవీకే నేత క్యారవ్యాన్‌లో బయలుదేరినప్పుడు ఆ వాహనాన్ని వేలాదిమంది వెంబడించారని, విపరీతమైన జనం రావడంతో స్థానిక పోలీసు అధికారులు వేలుచ్చామిపురానికి కాస్త ముందుగా ఉన్న అక్షయా ఆస్పత్రి వద్ద వాహనాన్ని నిలిపి ప్రసంగించాలని సూచించారన్నారు. అయితే పార్టీ నాయకులు వేలుచ్చామిపురం వద్దే సభ జరుపుతామని పట్టుబట్టారని స్టాలిన్ ఆరోపించారు. పోలీసుల హెచ్చరిక పట్టించుకోకుండా అక్షయా ఆస్పత్రి నుండి 35 మీటర్ల దూరం వరకు ప్రచార వాహనం వెళ్లడంతో దానికి ఇరువైపులా విపరీతమైన జనం చేరి తొక్కిసలాట ప్రారంభమైందన్నారు. మహిళలు, చిన్నారులు, వద్ధులు సొమ్మసిల్లి పడిపోయారని ఈ కారణంగానే పలువురు మృతి చెందారని సీఎం వివరించారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో కరూర్ దుర్ఘటనలాంటి ప్రమాదాలను ఎన్నడూ చూడలేదన్నారు. కరూర్ దుర్ఘటనపై తప్పుడు సమాచారం, వీడియోలను సోషల్‌మీడియాలో వెలువరించడంతో వాస్తవాలను ఐఏఎస్ అధికారుల ద్వారా వీడియో ఆధారాలతో ప్రజలకు తెలియజేశానని చెప్పారు.

అది భద్రతా వైఫల్యమే!

- ఈపీఎస్ ఆరోపణ



అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో జరిగిన టీవీకే రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోవటానికి ప్రభుత్వ భద్రతా వైఫల్యమే కారణమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. బుధవారం ఉదయం శాసనసభలో ఆయన ప్రసంగిస్తూ.. కరూర్‌లో టీవీకే రోడ్‌షో సందర్భంగా పోలీసు భద్రతా ఏర్పాట్లపై సీఎం స్టాలిన్ పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారన్నారు. కరూర్ దుర్ఘటనపై ప్రతిపక్షనేతగా ముందుగా తనను మాట్లాడేందుకు అనుమతించని స్పీకర్ అప్పావు వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో తూత్తుకుడి కాల్పుల సంఘటనను ప్రస్తావిస్తూ మంత్రి శివశంకర్ గత అన్నాడీఎంకే పాలనను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తొలగించని స్పీకర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ నుండి వాకౌట్ చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ వెలుపల ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. కరూర్ దుర్ఘటనపై సభలో చర్చ జరగాలని తాను డిమాండ్ చేశానని, స్పీకర్ చర్చకు అనుమతిస్తానని తనకు మాటిచ్చారని తెలిపారు. ఆలోగా ముఖ్యమంత్రి స్టాలిన్ సభలో కొన్ని విషయాలు తెలియజేస్తారని ప్రకటించారని, అదే అదనుగా ముఖ్యమంత్రి కరూర్ దుర్ఘటనపై సుదీర్ఘమైన ప్రసంగం చేశారని తెలిపారు. కరూర్‌లో టీవీకే రోడ్‌షోకు ప్రభుత్వం పటిష్టమైన భద్రత కల్పించి ఉంటే తొక్కిసలాటకు తావుండేది కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 41 మంది ప్రాణాలు కోల్పోయారని ఈపీఎస్ ఆరోపించారు. టీవీకే నేత పాల్గొంటున్న రోడ్‌షోలకు క్రమంగా వేల సంఖ్యలో రద్దీ అధికమవుతూ ఉందనే విషయం ఇంటెలిజెన్స్ విభాగానికి కూడా తెలుసని, అయినా కరూర్ రోడ్‌షోకు సరిపడేంత పోలీసు భద్రత కల్పించలేదన్నారు. గత జనవరి 24న ఎంజీఆర్ జయంతి వేడుకలు వేలుచ్చామిపురం ప్రాంతం వద్ద జరుపుకునేందుకు తాము అనుమతి కోరితే పోలీసులు నిరాకరించారని, అలా నిరాకరించిన ప్రదేశంలో టీవీకే రోడ్‌షోకు ఎలా అనుమతించారని ఈపీఎస్ ప్రశ్నించారు.

సభా పర్వం

నల్లబ్యాడ్జీలతో హాజరైన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

ఈపీఎస్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా బుధవారం అసెంబ్లీకి ఎడమచేతికి నల్లబ్యాడ్జీలు కట్టుకుని హాజరయ్యారు. కరూర్ దుర్ఘటనకు ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ, రాష్ట్రంలో జరుగుతున్న కిడ్నీల చోరీలను ఖండిస్తూ ఈ బ్యాడ్జీలు ధరించినట్లు అన్నాడీఎంకే సభ్యులు తెలిపారు. ఇలా అన్నాడీఎంకే సభ్యులంతా నల్లబ్యాడ్జీలు కట్టుకురావడం గమనించిన స్పీకర్ అప్పావు ఆ పార్టీ సభ్యులందరికీ ఉన్నట్టుండి బీపీ అధికమైనట్లుందని చమత్కరించారు. మంత్రి రఘుపతి మాట్లాడుతూ.. అన్నాడీఎంకే సభ్యులంతా జైలులో ఖైదీలు గుర్తింపు బ్యాడ్జీలు కట్టుకున్నట్లు నల్లబ్యాడ్జీలు కట్టుకుని వచ్చారని పేర్కొన్నారు.

స్పీకర్ పోడియం వద్ద అన్నాడీఎంకే సభ్యుల ధర్నా

కరూర్ దుర్ఘటనపై శాసనసభలో అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నాయకత్వంలో ఆ పార్టీ శాసనసభ్యులు పాలకపక్షంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరూర్‌లో తొక్కిసలాట చోటుచేసుకోవడానికి ప్రభుత్వం భద్రత కల్పించకపోవడమే కారణమని ఆరోపించారు. శాసనసభలో జీరో అవర్‌లో తూత్తుకుడిలో జరిగిన తుపాకీ కాల్పుల సంఘటనపై మంత్రి శివశంకర్ అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కించపరిచేలా కొన్ని వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈపీఎస్ సహా అన్నాడీఎంకే సభ్యులందరూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నేలపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యులంతా వారి సీట్లలో కూర్చుని ప్రశ్నలను అడుగవచ్చునని మంత్రి దురైమురుగన్ వారికి సూచించారు. అయినా ఈపీఎస్, అన్నాడీఎంకే సభ్యులు నినాదాలను కొనసాగించారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులను గెంటివేసేందుకు మార్షల్స్‌కు స్పీకర్ అప్పావు ఆదేశాలిచ్చారు. ఆ లోగా అన్నాడీఎంకే సభ్యులంతా సభ నుండి వాకౌట్ చేశారు. అయితే బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, ఆయన వర్గానికి చెందిన శాసనసభ్యులు మాత్రం వాకౌట్ చేయకుండా సభలోనే ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



శివగంగ జిల్లా కారైక్కుడి అళగప్ప వర్శిటీ ప్రాంగణంలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. గవర్నర్ ఆర్ఎన్ రవి శివగంగ జిల్లా కారైక్కుడి ప్రాంతంలోని అళగప్ప వర్శిటీ ప్రాంగణంలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే రాష్ట్రప్రభుత్వం తరుపున గిండి అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వున్న కలాం విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రులు స్వామినాథన్, కొవి చెళియన్, ఎం.సుబ్రమణ్యం, నగర డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి వి.రాజారామన్, ఆ శాఖ డైరెక్టర్ వైద్యనాథన్, స్థానిక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కలాంకు నివాళులర్పించారు. డాక్టర్ అబ్దుల్ కలాం సొంత జిల్లా అయిన రామనాథపురం రామేశ్వరం పేరంబు ప్రాంతంలో కేంద్రప్రభుత్వం నిర్మించిన స్మారక మందిరంలో కలాం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు.



గిండిలో రాష్ట్రప్రభుత్వం తరుపున కలాంకు నివాళులర్పిస్తున్న మంత్రులు స్వామినాథన్, కొవి చెళియన్, ఎం.సుబ్రమణ్యం తదితరులు

నేడు రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు

- చెన్నై నుంచి కుమరి వరకూ 17, 18 తేదీల్లో భారీ వర్షాలు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనుండటం, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుండటంతో చెన్నై నుండి కన్నియాకుమారి వరకు ఈ నెల 17 నుండి 18వరకు భారీగా వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు గురువారం ప్రవేశించే అవకాశం ఉందని, దాని ప్రభావంతో రాష్ట్ర మంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో సాధారణ స్థాయి 44 సెం.మీ అధిగమించి, 50 సెం.మీల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాల ఆగమనం, ఈ నెల 18 లేదా 19న బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడనుండటంతో దక్షిణాది, ఉత్తరాది జిల్లాలతో పాటు తీరప్రాంత జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో కుండపోతగా, మరికొన్ని ప్రాంతాల్లో భారీగా, ఇతర ప్రాంతాల్లో చెదురుమదురుగాను వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పరకటించింది.. చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కన్నియాకుమారి జిల్లాలో సముద్రతీర ప్రాంతాల్లో అలలు ఉధృతంగా ఉంటాయని, పెనుగాలులు బలంగా వీస్తాయని, జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. బంగాళాఖాతంలో లక్షదీవుల సమీపంలో ఈ నెల 18 లేదా 19న అల్పపీడనం ఏర్పడుతుందని, దాని ప్రభావంతో సముద్రతీర ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయన్నారు. ఇదిలావుండగా చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు తదితర జిల్లాల్లో బుధవారం వేకువజాము నుంచి సుమారు మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కోవాల్సివచ్చింది.



వర్షంలోనే కాలేజీలకు వెళ్తున్న విద్యార్థినులు



కంట్రోల్ రూమ్‌లో డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రి కేఎన్.నెహ్రూ తదితరులు

జీసీసీ ఆధ్వర్యంలో 'ఈశాన్యం' పై ముందస్తు చర్యలు

- కంట్రోల్ రూంను పరిశీలించిన ఉదయనిధి

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం వరద నివారణ చర్యలను అడ్డుకునేలా ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రాష్ట్రంలో రానున్న 24గంటల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం నాలుగు రోజుల క్రితమే హెచ్చరించింది. నగరంలో, శివారు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచే మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కార్యాలయం రిప్పన్ బిల్డింగ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నగరంలో వర్షపు నీరు నిలిచే రోడ్లు, అండర్ గ్రౌండ్ మార్గాలు, వీధులు, డంపింగ్ యార్డులు తదితరాలను ఈ కేంద్రం నుంచే నేరుగా పర్యవేక్షించవచ్చు. ఈ నేపథ్యంలో, డిప్యూటీ సీఎం ఉదయనిధి బుధవారం ఉదయం జీసీసీ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చే ఫిర్యాదులపై ఫోన్ ద్వారా ప్రజలతో ఆయన మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ మంత్రి కేఎన్.నెహ్రూ, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులున్నారు.

పూండి, పుళల్ నుంచి అదనపు జలాల విడుదల

- దిగువ ప్రాంతాలకు వరద హెచ్చరిక

అడయార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఈశాన్య' రుతుపవనాల ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే రిజర్వాయర్లలో సమృద్ధిగా వున్న నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరానికి తాగునీరందందించే పుళల్, పూండి జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. ఈ నేపథ్యంలో డ్యాంల భద్రత దృష్ట్యా పూండి, పుళల్ జలాశయాల నుంచి బుధవారం అదనపు జలాలను వదిలి దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తం చేశారు. తిరువళ్లూర్ జిల్లాలో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా జిల్లాలోని జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. అలాగే, పూండి జలాశయం పరివాహక ప్రాంతాలు, కృష్ణా కాలువ ద్వారా జలాశయంలోకి 2,600 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. ఆ ప్రకారం, డ్యాం భద్రత దృష్ట్యాల అదనపు జలాలు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఉత్తర్వులు జారీచేయడంతో బుధవారం సాయంత్రం డ్యాంలోని 7,10 క్రస్ట్ గేట్ల ద్వారా 700 ఘనపుటడుగుల నీటిని కొశస్థలి నదిలోకి విడుదల చేశారు. అదనపు జలాల విడుదలతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాలువ వెంబడి స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం తదితరాలకు పాల్పడరాదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పుళల్ నుంచి ... పుళల్ జలాశయం నుంచి 200 ఘనపుటడుగుల అదనపు జలాలను విడుదల చేశారు. పుళల్ పూర్తి సామర్థ్యం 3,300 మిలియన్ ఘనపుటడుగులు కాగా, ప్రస్తుతం 3,006 మిలియన్ ఘనపుటడుగుల మేర నీరు చేరింది. జలాశయంలో 90 శాతం నీరు చేరడంతో, భద్రత దృష్ట్యా 200 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతాప్ తెలిపారు.





పూండి జలాశయం, పుళల్ చెరువు నుంచి నుంచి విడుదల చేస్తున్న నీరు

సమాచార ధ్వని

18న మూడో విడత మెడికల్ కౌన్సెలింగ్ ఫలితాలు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సుల్లో అఖిల భారత కోటా సీట్లు రాష్ట్ర కోటా సీట్లకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ జరుగుతోంది. అందులో, రెండు విడత కౌన్సెలింగ్ పూర్తయింది. దేశవ్యాప్తంగా పలు కళాశాలల్లో, కొత్త మెడికల్ సీట్లు, అదనపు సీట్లు కేటాయించడంతో అఖిల భారత కోటా కౌన్సెలింగ్ పొడిగించారు. ఆ ప్రకారం, ప్రస్తుతం అఖిల భారత కోటా సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. విద్యార్థులు తమ కళాశాలలు ఎంపిక చేసుకునే గడువు ఈ నెల 18వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ఆరోజే ఫలితాలు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

దీపావళికి '108' అంబులెన్స్‌లు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని, 108 అంబులెన్స్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంచనున్నారు. ఈ మేరకు 108 అంబులెన్స్ అత్యవసర నిర్వహణ ప్రాంతీయ కార్యదర్శి మహ్మద్ బిలాల్ విడుదల చేసిన ప్రకటనలో... దీపావళి పండుగ సందర్భంగా అత్యవసర సేవలు అందించేలా అంబులెన్స్‌లు సిద్ధం చేశామన్నారు. 108 అంబులెన్స్ వాహనాల్లో మంటలు ఆర్పే పరికరాలు, రక్షణ ఉపకరణాలు, ఆక్సిజన్ సిలిండర్లు, అత్యవసర మందులు సిద్ధం చేసినట్టు మహ్మద్ బిలాల్ తెలిపారు.

డెల్టా సాగుకు నీటి విడుదల తగ్గింపు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాం నుంచి కావేరి డెల్టా సాగుకు విడుదల చేస్తున్న నీటిని 10వేల ఘనపుటడుగులకు తగ్గించారు. కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో మేట్టూరు డ్యాంకు బుధవారం ఉదయం 17,584 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. అలాగే, డ్యాం నుంచి డెల్టా సాగుకు 12వేల ఘనపుటడుగులు విడుదల చేస్తుండగా, డెల్టా జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం నుంచి నీటి విడుదల 10వేల ఘనపుటడుగులకు తగ్గించారు. ప్రస్తుతం డ్యాంలో 117.73 అడుగుల చొప్పున 89.89 టీఎంసీల నీటి నిల్వ లున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

దీపావళి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ నుంచి పోదనూరు, తాంబరం నుంచి కన్నియాకుమారి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి...

- నెం.06049 చెన్నై సెంట్రల్-పోదనూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17,18 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు పోదనూరు చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06050 పోదనూరు- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేది పోదనూరు నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి రాత్రి 11.10 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. అలాగే, ఈ నెల 21వ తేది పోదనూరు నుంచి రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు చెన్నై చేరుకుంటుంది.
- నెం.06133 తాంబరం-కన్నియాకుమారి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16,18 తేదీల్లో తాంబరం నుంచి రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.25 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06134 కన్నియాకుమారి-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ కన్నియాకుమారిలో మధ్యాహ్నం 3.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.30 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది.

జనవరి 24, 25 తేదీల్లో ప్రత్యేక 'టెట్'

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వచ్చే ఏడాది జనవరి 24,25 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) ప్రకటించింది. ఈ మేరకు టీఆర్బీ విడుదల చేసిన ప్రకటనలో... సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర పాఠశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న యూజీ, పీజీ ఉపాధ్యాయులు టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత కావాలన్నారు. టెట్ రాయని ప్రస్తుతం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం 2026లో మూడు ప్రత్యేక టెట్‌లు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఆ ప్రకారం, జనవరిలో ప్రత్యేక టెట్ నిర్వహించనున్నారు. జనవరి 24వ తేది పేపర్-1, 25వ తేది పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ నవంబరులో విడుదల చేయనున్నారు. అలాగే, వచ్చే ఏడాది జూలై, డిసెంబరులో నిర్వహించనున్న ప్రత్యేక టెట్ తేదీలు, నోటిఫికేషన్ తదుపరి విడుదల చేయనున్నట్లు టీఆర్బీ తెలిపింది.

ప్రాథమిక విద్య సర్టిఫికెట్ కోర్సు ఫలితాల విడుదల

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య సర్టిఫికెట్ కోర్సు పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు పరీక్షల శాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రాథమిక విద్య సర్టిఫికెట్ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు మే, జూన్‌లో నిర్వహించగా ఫలితాలు బుధవారం విడుదల చేసినట్లు తెలిపింది. విద్యార్థులు తాము చదివిన ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు, ప్రైవేటు అభ్యర్థులు జిల్లా ఉపాధ్యాయ విద్య, శిక్షణ సంస్థలను సంప్రదించి ఫలితాలు తెలుసుకోవచ్చు. మరిన్ని వివరాలు మార్కుల జాబితా నకలు కోసం www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి ఈ నెల 17 నుంచి 22వ తేది వరకు జిల్లా ఉపాధ్యాయ విద్య, శిక్షణా సంస్థ కార్యాలయాల్లో సమర్పించాలని, అందుకు రుసుముగా ఒక్కో పాఠ్యాంశానికి రూ.275 చెల్లించాలని తెలిపింది. మార్కుల జాబితా నకలు పొందిన వారు మాత్రమే రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పరీక్ష శాఖ తెలిపింది.

మదురై మేయర్ రాజీనామా

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆమె తన రాజీనామా లేఖను కమిషనర్ చిత్రా విజయన్‌కు అందజేశారు. మేయర్ రాజీనామాపై ఈ నెల 17న డిప్యూటీ మేయర్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. మదురై మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్ కార్పొరేషన్ ఆస్తిపన్నుల వ్యవహారంలో అవినీతికి పాల్పడి అరెస్టయిన సంగతి తెలిసిందే.

● అసెంబ్లీ సమాచారం..

ఏర్కాడులో కాఫీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రుణం

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.380 కోట్ల మేర రుణ సదుపాయం కల్పించినట్లు మంత్రి దామో అన్బరసన్ అసెంబ్లీలో ప్రకటించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడులో కాఫీ ఫ్యాక్టరీ పెట్టేవారికి ఆర్థిక సాయం అందిస్తామని అన్నాడీఎంకే ఎమ్మెల్యే చిత్రా అడిగిన ప్రశ్నకు మంత్రి దామో అన్బరసన్ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఏర్కాడులో 7 వేల హెక్టార్ల విస్తీర్ణంలో కాఫీ గింజలు పండిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ శాఖ ద్వారా కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు సాఫీగా జరిగేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించడమే కాకకుండా ఉత్పత్తుల తయారీకి సంబంధించిన శిక్షణ, సలహాలు కూడా అందిస్తున్నామని చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.380 కోట్ల రుణం...

ఉభయచర వాహనాల కొనుగోలు...

ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఉపయోగించడానికి అనువుగా నీటిలో, నేలపై ప్రయాణించడానికి అనువైన ఉభయచర వాహనాలను కొనుగోలు చేయనున్నట్లు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తెలిపారు. పంజాబ్‌లో వరదలు సంభవించినప్పుడు నీటిలో, నేలపై నడిపే వాహనాలను ప్రవేశపెట్టారని, ఆ రీతిలోనే రాష్ట్రంలో ఉభయచర వాహనాలను వాడుకలోకి తీసుకువస్తామని డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

నీటిపథకాలకు నిధులివ్వని కేంద్రం...

రాష్ట్రంలో నీటి పథకాలను సక్రమంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తగినంత నిధులు ఇవ్వడం లేదని మంత్రి కేఎన్ నెహ్రూ ఆరోపించారు. హొగెనేకల్‌లో రెండో సమగ్ర తాగునీటి పథకాన్ని వీలయినంత త్వరగా అమలు చేయాలని పీఎంకే శాసనసభ్యుడు జీకే మణి డిమాండ్ చేశారు. అందుకు మంత్రి నెహ్రూ బదులిస్తూ హొగెనేకల్ ద్వితీయ సమగ్ర తాగునీటి పథకం అమలుకు ప్రభుత్వం రూ.8900 కోట్ల మేరకు నిధులు మంజూరు చేసిందని, అందులో జపాన్ సహకార సంస్థ ప్రకటించిన నిధులు వచ్చే యేడాది జనవరిలోగా అందే అవకాశం ఉందన్నారు. ఈ పథకానికి కేంద్రం రూ.2500 కోట్ల మేరకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని, కేంద్రం ఇంకా నిధులను విడుదల చేయలేదని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పింఛన్ రూ.35 వేలకు పెంపు...

మాజీ శాసనసభ్యులు, విధానమండలి సభ్యులకు చెల్లించే ఫించన్‌ను రూ.30 వేల నుండి రూ.35 వేలకు



పెంచుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం ఉదయం శాసనసభలో ముసాయిదా చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రైవేట్ వర్సిటీలకు 35 ఎకరాల స్థలం...

రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు వంద ఎకరాల స్థలం తప్పనిసనే నిబంధన సడలిస్తూ శాసనసభలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్ ఓ ముసాయిదా చట్టాన్ని ప్రవేశ పెట్టారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏర్పాటుచేయడానికి నగర పంచాయతీల్లో 35 ఎకరాలు, కార్పొరేషన్ ప్రాంతాల్లో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసుకోవచ్చునని మంత్రి కొవి చెళియన్ అన్నారు.

● అదనపు కట్నం వేధింపుల కేసు..

రితన్య సెల్‌ఫోన్ల పరిశీలన

● హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా అవినాశి సమీపంలోని కైక్కాట్టిపుదూర్‌లో వరకట్నం వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన రితన్య (27) సెల్‌ఫోన్లను పరిశీలించాలని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. కైక్కాట్టిపుదూర్‌కు చెందిన అన్నాదురై కుమార్తె రితన్య వివాహం జరిగిన 78వ రోజు ఓ ఆడియో విడుదల చేసి ఆత్మహత్యకు పాల్పడింది. వరకట్నం వేధింపుల కారణంగా ఆమె ఈ దారుణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదుచేసి ఆమె భర్త కవిన్‌కుమార్, మామ ఈశ్వరమూర్తి, అత్త చిత్రాదేవీలను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. ఈ ముగ్గురు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు వేయించారు. విచారణ జరిపిన హైకోర్టు ఆ ముగ్గురిని కండిషన్ బెయిల్ మంజూరుచేసి, వారు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇదిలా వుండగా రితన్య ఆత్మహత్య కేసు విచారణను సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ ఆమె తండ్రి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఇదిలా వుండగా, కవిన్‌కుమార్ కూడా హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. అందులో తాను బెయిల్‌పై విడుదలై ఇంటికి వెళ్లిన సమయంలో రెండు సెల్‌ఫోన్లను గుర్తించానని, వాటిని పరిశీలించేలా పోలీసులకు ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్ బుధవారం న్యాయమూర్తి సతీష్‌కుమార్ ముందు విచారణకు రాగా, కవిన్‌కుమార్ తరుపు న్యాయవాది



భర్త, అత్తామామలతో రితన్య (ఫైల్‌ఫొటో)

వాదిస్తూ ఈ వివాహంలో తనకు ఇష్టంలేదని రితన్య స్నేహితులితో అన్న మాటలు ఆమె సెల్‌ఫోన్‌లో రికార్డ్ అయ్యిందని, అందువల్ల ఆమె సెల్‌ఫోన్లను పరిశీలించాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరారు. సెల్‌ఫోన్లను దర్యాప్తు అధికారికి అప్పగించి పరిశీలించనున్నట్లు పోలీసుల తరుపు న్యాయవాది హామీ ఇచ్చారు. ఈ వాదనల విన్న అనంతరం రితన్య రెండు సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరిశీలించి నివేదిక దాఖలు చేయాల్సిందిగా సంబంధిత పోలీసులకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

మానవతా దృక్పథంతోనే అత్యవసర పోస్టుమార్టం

● అసెంబ్లీలో మంత్రి సుబ్రమణ్యం వివరణ

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో మృతిచెందిన 41 మందికి మానవతా దృక్పథంతో అత్యవసర పోస్టుమార్టం నిర్వహించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం బుధవారం అసెంబ్లీలో వివరించారు. స్పీకర్ అప్పావు అధ్యక్షతన వర్షాకాలపు అసెంబ్లీ సమావేశాలు మంగళవారం ప్రారంభంకాగా, రెండో రోజు జీరో అవర్ ప్రారంభమైన వెంటనే కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిపై చర్చ జరిగింది. ఈ దుర్ఘటనపై ప్రతిపక్ష సభ్యులు మాట్లాడకముందే సీఎం స్టాలిన్ వివరణ ఇవ్వడం చర్చనీయాంశమైంది. ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి స్పీకర్ వైఖరిని తప్పుబడుతూ ఏకపక్ష నిర్ణయం సరికాదని వాదించారు. దుర్ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి సమయంలో 41 మంది మృతదేహాలకు పోస్టుమార్టం ఎలా నిర్వహించగలిగారని ఆయన ప్రశ్నలేవనెత్తారు. అసలు అర్ధరాత్రి పోస్టుమార్టం పూర్తిచేయాల్సిన అవసరమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై మంత్రి ఎం.సుబ్రమణ్యం వివరణ ఇస్తూ మృతుల కుటుంబాలు ఆవేదన తదితరాలను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో మృతదేహాలను త్వరితగతిన అప్పగించాలన్న ఉద్దేశంతోనే ఒక్కరోజులో పోస్టుమార్టం నిర్వహించామని తెలిపారు. దీనిని పూర్తిగా వీడియోల్లో కూడా రికార్డు చేశామని, ఇంతకు ముందు గుజరాత్ విమాన ప్రమాద ఘటనలో 12 గంటల వ్యవధిలో పోస్టుమార్టం పూర్తిచేశారని, అందువల్లే కరూర్ పోస్టుమార్టంలపై అనుమానించడం సరికాదని మంత్రి తెలిపారు.

నాలుగేళ్లలో 2,394 చౌక దుకాణాలు

● అసెంబ్లీలో మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో కొత్తగా దాదాపు 2,394 చౌకదుకాణాలను ప్రారంభించినట్లు రాష్ట్ర మంత్రి పెరియకరుప్పన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో నాంగునేరి నియోజకవర్గ పరిధిలోని కుళవన్‌కుళం గ్రామంలో కొత్తగా పార్ట్‌టైమ్ చౌకదుకాణం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రూబీ మనోహరన్ కోరారు. చౌకదుకాణాలు కొత్తగా ఏర్పాటు చేయాలంటే నగర ప్రాంతాల్లో 800 రేషన్ కార్డులుండాలని, గ్రామాల్లో 500 రేషన్‌కార్డులు, కొండ ప్రాంతాల్లో 400 రేషన్‌కార్డులుండాలని మంత్రి తెలిపారు.. ఇవి కలిగిన ప్రాంతాల్లో కొత్త చౌకదుకాణాలు ప్రారంభించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు ఈ నాలుగేళ్లలో సుమారు 2,394 కొత్త చౌకదుకాణాలు ప్రారంభించామని, వాటిలో 1,605 పార్ట్ టైమ్‌గా, 789 ఫుల్‌టైమ్ దుకాణాలని మంత్రి వివరించారు.

మళ్లీ సుప్రీంకోర్టుకు గవర్నర్ వ్యవహారం

అడయార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. రాష్ట్ర శాసనసభలో ఏప్రిల్ 29న తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ చట్ట సవరణ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపారు. స్పోర్ట్స్ యూనివర్శిటీ బోర్డుకు ఆర్థిక కార్యదర్శి నియమించేలా చట్ట సవరణ చేశారు. ఈ బిల్లును రాష్ట్రపతికి గవర్నర్ పంపించారు. దీనిపై గవర్నర్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. బిల్లుల పట్ల గవర్నర్ నిర్వహిస్తున్న విధానం రాజ్యాంగ విరుద్ధమని, గవర్నర్ చర్యలు ఏకపక్షమైనవిగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

హత్యకేసులో బీజేపీ నేతకు జీవిత ఖైదు

అడయార్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోవైలో యువకుడు హత్యకేసులో బీజేపీ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు కందస్వామికి కోర్టు జీవిత ఖైదు విధించింది. 2018లో వినాయక చవితి విరాళాల సేకరణలో తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో, నాగరాజ్ అనే యువకుడు హత్యకు గురయ్యాయడు. ఈ కేసులో బీజేపీ నేత కందస్వామికి జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ కోవై జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. **అంబత్తూర్:** టీవీఎస్ నగర్, కండిగై వీధి, అన్నై నగర్ మెయిన్ రోడ్డు, పద్మావతి నగర్, అన్బు నగర్, సంతోష్ నగర్, మోహన్ గార్డన్, వాటర్ కెనాల్ రోడ్డు, పల్ల వీధి. **అన్నా నగర్:** జయలక్ష్మి నగర్, ధనలక్ష్మి నగర్, మూకాంబిగాళ్ నగర్, బాలకృష్ణ నగర్, రాజీవ్ గాంధీ నగర్, జానకిరామ్ కాలని, భువనేశ్వరి నగర్, రామలింగ నగర్, తామరై అవెన్యూ. **తిల్లై గంగా నగర్:** వాంజినాథన్ వీధి.. ఎక్స్‌టెన్షన్, ఉత్తమర్ గాంధీ వీధి, తిరువళ్లువర్ నగర్, భారతిదాసన్ వీధి, నేతాజీ వీధి, కేసరి నగర్ మెయిన్ రోడ్డు మరియు 1 నుంచి 7 వీధులు, సురేంద్ర నగర్ 6 నుంచి 11 వీధులు మరియు ఎక్స్‌టెన్షన్, భారత్ నగర్, యమున వీధి, కావేరి వీధి, తెన్‌పెన్నై వీధి, ఠాగూర్ వీధి, వాల్మీకి వీధి, ఇళంగో వీధి, నెహ్రూ వీధి, కృష్ణా వీధి, వివేకానంద వీధి, ఇన్‌కమ్‌టాక్స్ కాలని 1వ వీధి, బాలాజీ నగర్ 1వ వీధి, శాంతి నగర్, డీఆర్‌ఏ ఆస్కాట్, కేజీ పిన్నాక్లే.

రేపు అన్నాడీఎంకే 54వ వార్షికోత్సవం

● పార్టీ పతాకం ఎగురవేయనున్న ఈపీఎస్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకే ఈ నెల 17వ తేది 54వ వసంతంలోకి ప్రవేశిస్తోంది. వేడుకల సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు రాయపేట అవ్వై షణ్ముగం రోడ్డులోని పార్టీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేసి, నేతలు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేయనున్నారు. పార్టీ 54వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పార్టీ పతాకాలు ఎగురవేసి, ప్రజలకు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.

వామ్మో.... 44 కిలోల కర్రపెండలం



కర్రపెండెలంతో రైతు కనకరాజ్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా అరుమనై సమీపంలోని రైతు కనకరాజ్ పొలంలో 44 కిలోల బరువైన కర్రపెండలం వచ్చింది.. కనకరాజ్ తన పొలంలో ఏడాది క్రితం కర్రపెండలం మొక్కలు నాటాడు. మంగళవారం పంట తీశాడు.. ఆ సమయంలో ఓ కర్ర పెండెలం బయటకు తీసేందుకు వీలుకాలేదు. కనకరాజ్, మరో ఇద్దరి సాయంతో కర్రపెండలంను వెలికితీయగా, అది 44 కిలోల బరువుంది. ఈ భారీ కర్రపెండలం చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కనకరాజ్ ఇంటికి క్యూ కట్టారు.

రీ హాబిలిటేషన్ సెంటర్ నుంచి 35 మంది పరారీ

ప్యారీస్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మాంగాడు సమీపం చక్రానగర్‌లో ఉన్న మత్తు బానిస పునరావాస కేంద్రం నుంచి పరారైన 35 మంది రోగుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మత్తుమందుకు అలవాటుపడి అందులో నుంచి బయటపడలేక సతమతమవుతున్న బాధితుల కోసం చక్రానగర్‌లో జీవన్ కేర్ అనే సంస్థ నడుపుతున్న పునరావస కేంద్రంలో సుమారు 50 మందికి పైగా చికిత్సల పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం ఈ కేంద్రం నుండి 35 మంది బాధితులు ఒకేసారి పరారైనట్లు వార్డెన్ మాంగాడు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. చికిత్స పేరుతో చిత్రహింసలు పెడుతున్న కారణంగా రోగులు పరారైయ్యారా? మరేదైనా కారణమా? అన్న కోణంలో విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా పరారైన వ్యక్తుల పేర్లు, వారి ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్ల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

కండక్టర్ నిజాయితీ

● బస్సులో దొరికిన రూ.లక్ష పోలీస్ స్టేషన్‌లో అప్పగింత

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బస్సులో దొరికిన రూ.లక్ష రూపాయలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన కండక్టర్‌ను అధికారులు, పోలీసులు అభినందించారు. ఈరోడ్ జిల్లా వెల్లబొత్తాంపాళయం గ్రామానికి చెందిన షణ్ముగం (65) కొబ్బరితోటను వెల్లకోవిల్ ముత్తూరుకు చెంది న శంకర్ లీజుకు తీసుకున్నాడు. లీజుకు సంబంధించిన నగదు షణ్ముగంకు అందజేసిన శంకర్, మిగిలిన రూ.లక్షతో మంగళవారం మధ్యాహ్నం ప్రైవేటు బస్సులో ప్రయాణించారు.నత్తంకడయూరులో బస్సుదిగిన శంకర్, డబ్బు సంచిని బస్సులో మరచిపోయాడు. బస్సు కండక్టర్ మహేంద్రన్ సీటులో ఉన్న బ్యాగులో నగదు ఉన్నట్లు గుర్తించాడు. డ్రైవర్ రాజాతో కలసి తారాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహేంద్రన్, బ్యాగును పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టిన పోలీసులు, శంకర్‌కు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు రప్పించి, నగదు అందజేశారు. బస్సులో దొరికిన నగదును నిజాయితీగా అప్పగించిన కండక్టర్ మహేంద్రన్, డ్రైవర్ రాజాలను సీఐ (నేర విభాగం) శరవణన్, పోలీసులు అభినందించారు.



కండక్టర్ మహేంద్రన్, డ్రైవర్ రాజాను అభినందిస్తున్న అధికారులు, పోలీసులు

ఏడు పోస్టులకు 3,956 దరఖాస్తులు

● ఒక్కో పోస్టుకు 500 మంది పోటీ

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలోని పెరియకుళం, మైలాడుపారై, చిన్నమనూరు, తేని పంచాయితీ యూనియన్ పరిధిలో 4 ఆఫీసు అసిస్టెంట్లు, రెండు రిజిస్టర్ క్లర్క్, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి గత నెల 30వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ పోస్టులకు 10వ తరగతి అర్హత కావడంతో, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు మొత్తం 3,956 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్లు సమర్పించకపోవడంతో, 400 దరఖాస్తులను అధికారులు తిరస్కరించగా, మిగిలిన 3,500 మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానించాఇరు. తేని యూనియన్ కార్యాలయంలో ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల పరిశీలన తేని బీడీఓ మురుగేశ్వరి నేతృత్వంలో జరిగింది. ఈ ఇంటర్వ్యూ ఈ నెల 17వ తేది వరకు జరుగనుంది. ఆ ప్రకారం, ఒక్కో పోస్టుకు సుమారు 500 మంది పోటీపడుతున్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా చేపట్టనున్న పోస్టుల భర్తీ మార్గదర్శకంగా చేపడతామని జిల్లా అధికారులు తెలిపారు.



ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

బస్సులో స్పృహ కోల్పోయిన విద్యార్థిని

తిరుత్తణి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై వెళ్తున్న బస్సులో 12వ తరగతి విద్యార్థిని స్పృహకోల్పోయిన ఘటన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా... తిరుత్తణిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న 16యేళ్ల విద్యార్థిని పాఠశాలకు బస్సులో వెళుతుండగా మార్గమధ్యలో స్పృహ కోల్పోయింది. గమనించిన ప్రయాణికులు ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమె కిరోసిన్ తాగినట్లుగా నిర్ధారించారు. వెంటనే ఐసీయూకి తరలించి చికిత్స అందించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వైద్యులు విద్యార్థిని శరీరంపై బ్లేడు గాయాలను, 'నా జీవితం వృధా' అని పెన్నుతో రాసివుండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థిని తల్లిదండ్రులను విచారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విద్యార్థిని కిరోసిన్ ఎందుకు తాగింది?, శరీరంపై ఆ గాయాలెలా వచ్చాయి?, విద్యార్థినిపై ఎవరైనా దాడిచేశారా? అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇదిలా వుండగా, విద్యార్థిని చదువుతున్న పాఠశాల ప్రాంగణంలో పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు



చేతిపై బ్లేడు గాయాలు

సహకార బ్యాంక్‌లో నగల మాయం వ్యవహారం

● బాధితుల వినూత్న ధర్నా

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేటలోని సహకార బ్యాంక్‌లో మాయమైన నగలు తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎద్దుకు వినతి పత్రం అందజేసి వినూత్న నిరసన చేపట్టారు. ఉళుందూర్‌పేట సమీపం తిరునల్లూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ లాకర్‌లో ఉంచిన 1,790 సవర్ల బంగారు నగలు 2010 అక్టోబరు 22న చోరీకి గురయ్యాయి. అప్పటి డీఐజీ మాసానముత్తు, ఎస్పీ పగలవన్ విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. ఈ క్రమంలో, చోరీకి గురైన నగలు తిరిగి స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్‌తో బాధిత రైతులు సహకార బ్యాంక్ ఎదుట ఐదు విడతలుగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, తిరునల్లూరు బస్టాండ్ వద్ద రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలుమలై, జిల్లా కార్యదర్శి స్టాలిన్ మణి నేతృత్వంలో బాధిత రైతులు ధర్నా చేపట్టారు. నగలు స్వాధీనంలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులు, అధికారుల తీరును నిరసిస్తూ రైతులు ఎద్దుకు వినతి పత్రం సమర్పించి వినూత్న ధర్నా చేపట్టారు.



ఎద్దుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

హోటల్‌లో వ్యభిచారం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలోని హోటల్‌లో వ్యభాచారం సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో, ఈనెల 13న అరుంబాక్కం నెహ్రూ రోడ్డులోని ఓ హోటల్‌లో తనిఖీ చేశారు. ఓ గదిలో మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో తిరువళ్లూర్ జిల్లా పోరూర్ కారంపాక్కం ప్రాంతానికి చెందిన లక్ష్మణన్ (45)ను అరెస్ట్ చేసి, నలుగురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

తండ్రి కొత్త ఆటోలో జాలీ రైడ్

● ప్రమాదవశాత్తు కుమార్తె మృతి

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తండ్రి కొత్తగా కొనుగోలు చేసిన ఆటోలో జాలీ రైడ్‌కు వెళ్లిన బాలిక, ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తిరుచ్చి జిల్లా తిల్లాంపట్టి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ రాజ్ కుమార్‌కు గ్రేసికా (9) అనే కుమార్తె, లిథన్‌రామ్ (7) అనే కుమారుడు ఉన్నారు. సోమవారం రాజ్ కుమార్ కొత్తగా ఆటో కొనుగోలు చేసి ఇంటికి తీసుకొచ్చాడు. మంగళవారం, కొత్త ఆటోలో వెళ్దామని పిల్లలు రాజ్‌కుమార్‌ను కోరారు. దీంతో, రాజ్‌కుమార్, భార్య పిల్లలను కొత్త ఆటోలో ఎక్కించుకుని బయల్దేరాడు. వెల్లకుళం ప్రాంతంలో ఆటో హఠాత్తుగా అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన గ్రేసికా ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై మన్నచనల్లూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



మృతురాలు గ్రేసికా (ఫైల్ ఫొటో)

తుపాకీతో కాల్చుకుని విద్యార్థి ఆత్మహత్య

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మదురైలో పదో తరగతి విద్యార్థి తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మదురై కే పుదూరు పోలీసుస్టేషన్ పరిధిలోని సంబకుళం వద్ద అపార్టెమెంట్‌లో ఓ బ్యాంక్ అధికారి వడివేల్, ఆయన సతీమణి కృత్తికా నివసిస్తున్నారు. వీరికి యువన్ (15) అనే కుమారుడు ఉన్నాడు. యువన్ మేలూరులో పదో తరగతి చదువుతున్నాడు. జాతీయ రైఫిల్‌పోటీల్లో పాల్గొని, రైఫిలింగ్ శిక్షణ కూడా పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఏదో విషయమై మంగళవారం ఉదయం తల్లిదండ్రులతో గొడవపడిన యువన్ ఇంటిలో ఒంటరిగా ఉన్నప్పుడు తన వద్దనున్న రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న యువన్ తల్లిదండ్రులు ఓ గదిలో నెత్తురుమడుగులో అతడు పడిఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికిచేరుకుని యువన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



యువన్ (ఫైల్‌ఫొటో)

ఘనంగా 'శ్రీరామచంద్ర' స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న శ్రీధర్ వేంబు



స్నాతకోత్సవానికి హాజరైన విద్యావేత్తలు, విద్యార్థులు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' 40వ స్నాతకోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోహో కార్పొరేషన్ చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ వేంబు 75 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు బహూకరించారు. వర్సిటీ ఛాన్స్‌లర్ వీఆర్ వెంకటాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 1871 మంది వైద్య విద్యార్థులకు పీహెచ్‌డీ, పీజీ, యూజీ డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రొ ఛాన్స్‌లర్ ఆర్‌వీ సెంగుట్టువన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్ వార్షిక నివేదిక వినిపించారు. అదే విధంగా కెనడాలోని సెయింట్ జాన్ ఫిషర్ యూనివర్సిటీ, మలేసియాలోని యూనివర్శిటీ ఆఫ్ సైబర్ జయ, ఒమన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ నిజ్వా వంటి విద్యా సంస్థలతోనూ ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ మహేష్ వాకమూడి, మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సెంథిల్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఆర్.పద్మావతి, ఫైనాన్స్ విభాగ డైరెక్టర్ జె.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

16 సిప్కాట్లలో విద్యా ఆధారిత క్రెచ్ సదుపాయాలు



క్రెచ్‌లను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 16 సిప్కాట్ పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసిన విద్యాధారిత క్రెచ్‌లను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఉద్యోగస్తులైన మాతృమూర్తులకు ఒత్తిడి తగ్గించేందుకు, శ్రామిక శక్తితో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు సిప్కాట్‌తో 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' (ఫిక్కీ ఫ్లో) చెన్నై భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా శ్రామికశక్తిగా వున్న మహిళలకు అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. క్రెచ్‌లను సిప్కాట్ అభివృద్ధి చేయగా, ఫిక్కీ ఫ్లో చెన్నై నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టు సుమారు 3.23 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని అధికారులు తెలిపారు. ఒరగడం, గుమ్మిడిపూండి, సిరుసేరి, కడలూరు, రాణీపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ క్రెచ్‌ల్లో 6 నెలల నుంచి ఐదు సంవత్సరాల మధ్య వయసున్న చిన్నారులను ఆలనాపాలనా చూడనున్నారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ ఫ్లో ఛైర్‌పర్సన్ నియాతి మెహతా, దివ్య అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి

శస్త్రచికిత్సల్లో 'అపోలో' రికార్డు



మీడియా సమావేశంలో రోబోటిక్ కీలు మార్పిడి శస్త్రచికిత్స విధానాన్ని వివరిస్తున్న వైద్యనిపుణులు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓల్డ్ మహాబలిపురం రోడ్డు (ఓఎమ్మార్)లోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఐదు నెలల వ్యవధిలో 150 రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు ఆ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వెంకటరమణన్ స్వామినాథన్, డాక్టర్ దామోదరన్ పీఆర్, డాక్టర్ సెంథిల్ కమలశేఖరన్, డాక్టర్ మదన్ తిరువేంగడాన్ సంయుక్తంగా ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఈ వైద్యనిపుణులు మాట్లాడుతూ రక్త స్రావం జరగకుండా ఈ రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సలు జరిపినట్లు తెలిపారు. అపోలో హాస్పిటల్స్ చెన్నై రీజిన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఇలన్‌కుమరన్ కళియమూర్తి మాట్లాడుతూ తమ ఆస్పత్రుల్లో రోబోటిక్ సర్జరీకి సంబంధించి సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉండటం వల్లే 150 రోజుల్లో 150 రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేయగలిగామని చెప్పారు. ఈ రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స చేసుకున్నవారు 4 రోజుల్లోగా కోలుకుంటారని తెలిపారు.



చెన్నై చెట్‌పెట్‌లోని మద్రాసు క్రిస్టియన్ కాలేజ్ హయ్యర్ సెకండరీ స్కూలు ఆధ్వర్యంలో బుధవారం 'లేజర్ 2025' పేరుతో నిర్వహించిన అంతర్ జిల్లా పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ పరిశోధనలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు.

ప్రజల కోసం తీసిన సినిమా 'డీజిల్'



మీడియా సమావేశంలో 'డీజిల్' చిత్ర బృందం

చిత్రజ్యోతి

● హీరో హరీష్ కళ్యాణ్

సామాన్యుల జీవితాల్లో ముఖ్యమైన పాత్ర పోషించే పెట్రోల్, డీజిల్ వంటి వాటివెనుక ఎలాంటి మాఫియా జరుగుతుందో ప్రజలు ఖచ్చితంగా తెలుసుకోవాలని, అందుకే ఈ సినిమా ప్రజల కోసం తీసిందని అనడంలో ఎలాంటి సందేహం లేదని 'డీజిల్' చిత్ర హీరో హరీష్ కళ్యాణ్ అన్నారు. షణ్ముగం ముత్తుస్వామి దర్శకత్వంలో హరీష్ కళ్యాణ్, అతుల్యా రవి జంటగా నటించిన 'డీజిల్' చిత్రం ఈ నెల 17న విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని చిత్ర బృందం సోమవారం నగరంలో మీడియా సమావేశం నిర్వహించింది. ఇందులో హీరోహీరోయిన్లతో పాటు సంగీత దర్శకుడు దిబు నినన్ థామస్, కెమెరామెన్ రిచర్డ్ ఎం.నాథన్, నటులు వినయ్, ప్రేమ్ కుమార్, వివేక్ ప్రసన్న, తంగదురై, మూనార్ రమేష్, నిర్మాత దేవరాజులు మార్కండేయన్ సహా చిత్ర బృందం పాల్గొంది. ఇందులో హీరో హరీష్ కళ్యాణ్ మాట్లాడుతూ, 'యాక్షన్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. ఇందుకోసం ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నాను. 'డీజిల్' రూపంలో మంచి కథ లభించింది. ట్రైలర్‌లో నా నటన చూసి చాలా మంది ప్రశంసించారు. సినిమాను ఎంతగానో ప్రేమించే దర్శక నిర్మాతల కోసం ఈ సినిమా హిట్ కావాలి' అని కోరారు. చిత్ర దర్శకుడు షణ్ముగం ముత్తుస్వామి మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు అవిశ్రాంతంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఇంట్రడక్షన్ పాట పాడిన హీరో శింబుకు ప్రత్యేక ధన్యవాదాలు. రొమాంటిక్, ఫ్యామిలీ సినిమాలు తీసే నేను ఓ రోజున పెట్రోల్ బంక్‌లో కనిపించిన దృశ్యమే ఈ చిత్ర కథను పునాది. ఇంధనం తెచ్చిన ట్యాంకర్ లారీ నుంచి కొందరు యువకులు బక్కెట్లలో చోరీ చేయడాన్ని గమనించాను. తర్వాత వారిని అనుసరించగా, షాకింగ్ విషయం తెలుసుకున్నాను. అపుడే ఈ మాఫియా కోసం సినిమా తీయాలని నిర్ణయించుకున్నాను. ఈ విషయం తెలుసుకున్న ఇంధన మాఫియా నన్ను చంపేస్తామని బెదిరించినప్పటికీ నేను సినిమా తీయాలని నిర్ణయించుకుని ఈ కథ రాశాను. డీజిల్ మాఫియా వల్ల సామాన్యుడు ఏ మేరకు ప్రభావితం అవుతాడన్నదే ఈ సినిమా వన్‌లైన్ స్టోరీ. ఈ సినిమా కోసం నిర్మాత దేవరాజులు ఏమాత్రం వెనుకాడకుండా ఖర్చు చేశారు' అన్నారు. హీరోయిన్ అతుల్యా రవి మాట్లాడుతూ 'ఈ సినిమా నాతో పాటు ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అయింది. ఇందులో ఒక మంచి పాత్ర ఇచ్చినందుకు దర్శకుడుకి అభినందనలు. ఈ దీపావళిని 'డీజిల్' మూవీతో జరుపుకోవాలి' అని కోరారు.

ఆన్‌లైన్ రుణాల కష్టాలతో 'గేమ్ ఆఫ్ లోన్స్'



'గేమ్ ఆఫ్ లోన్స్'లో నివాస్ ఆదిత్యన్ - ఎస్తర్

ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించలేని వారిని ఆ యాప్ ప్రతినిధులు ఏ విధంగా వేధిస్తారో కళ్లకు కట్టినట్టుగా వివరించే చిత్రంగా 'గేమ్ ఆఫ్ లోన్' మూవీ రూపొందించినట్టు దర్శకుడు అభిషేక్ లెస్లీ వెల్లడించారు. శుక్రవారం విడుదలకానున్న ఈ చిత్రం వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఆన్‌లైన్ జూదానికి బానిసలైన కొందరు ఆన్‌లైన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకుని వాటిని తిరిగి చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు రోజూ చూస్తున్నాం. ఈ చిత్రంలో కూడా హీరో ఆన్‌లైన్ జూదానికి బానిసై ఆన్‌లైన్ యాప్‌లో రుణాలు తీసుకుంటారు. వాటిని తిరిగి చెల్లించలేక హీరో ఎలాంటి కష్టాలు, చిత్ర హింసలు అనుభవించాడో కళ్ళకు కట్టినట్టుగా ఈ చిత్రం వివరిస్తుంది. మంచి సందేశాత్మక చిత్రంగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది. ఇందులో నివాస్ ఆదిత్యన్, అభినయ్, అద్విక్, ఎస్తర్ ప్రధాన పాత్రలను పోషించగా, జో కోస్టా సంగీతం అందించారు. జేఆర్‌జీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్.జీవానందం నిర్మించారు. ఇప్పటివరకు చాలా సినిమాల్లో చిన్నచిన్న పాత్రలను పోషించిన నివాస్ ఆదిత్యన్ ఇందులో భావోద్వేగ పాత్రలో అద్భుతంగా నటించారు. అలాగే, చాలాకాలం తర్వాత నటుడు అభినయ్ ఓ ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. నివాస్ ఆదిత్యన్ భార్యగా ఎస్తర్ నటించారు. సినిమా మొత్తం ఒకే లోకేషన్‌లో తీసినప్పటికీ ఎంతో ఇంట్రెస్టింగా, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ముందుకు కొనసాగుతుంది. ఖచ్చితంగా ప్రేక్షకులు కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.

మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధనుష్?



మారి సెల్వరాజ్ - ధనుష్

డైరెక్టర్ మారి సెల్వరాజ్ - హీరో ధనుష్ కాంబినేషన్ మరో మారు రిపీట్ కానుంది. గతంలో వీరిద్దరి మధ్య 'కర్ణన్' చిత్రం వచ్చిన విషయం తెల్సిందే. ఇపుడు మళ్ళీ వీరిద్దరూ కలిసి పనిచేయనున్నారు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో 'బైసన్' సినిమా రూపొందగా, ఈ నెల 17వ తేదీన విడుదలకానుంది. ఈ సినిమా విడుదలైన తర్వాత మారి సెల్వరాజ్... ధనుష్ ప్రాజెక్టుపై దృష్టిసారించనున్నారు. ఈ చిత్రాన్ని హీరో ధనుష్‌తో కలిసి మరో సంస్థ నిర్మించనుంది. ధనుష్ మూవీ పూర్తి చేసిన తర్వాత మారి సెల్వరాజ్... ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కుమారుడు ఇన్బన్ ఉదయనిధి, కార్తి చిత్రాలకు దర్శకత్వం వహించనున్నారు. కార్తి హీరోగా నటించే చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్, ఇన్బన్ ఉదయనిధి నటించే చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించనుంది.

అక్క, చెల్లి, తల్లి పాత్రలకు సిద్ధం

● రజీషా విజయన్



కేవలం హీరోయిన్‌గానే కాకుండా అక్క, చెల్లి, తల్లి పాత్రల్లో నటించేందుకు సిద్ధమని హీరోయిన్ రజీషా విజయన్ వెల్లడించారు. ఆమె హీరోయిన్‌గా 'బైసన్' మూవీలో నటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కర్ణన్' సినిమా తర్వాత దర్శకుడు మారి సెల్వరాజ్ నాకు అవకాశం ఇవ్వలేదు. 'బైసన్' మూవీ కోసం నన్ను పిలిచేందుకు ఆయన వెనుకంజ వేశారు. హీరోయిన్‌గానే కాకుండా అక్క, చెల్లి, తల్లి పాత్రల్లో నటించేందుకు కూడా సిద్ధం. నేను మలయాళీ. కానీ తమిళ ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు మగ్ధురాలినైపోయాను. తమిళంలో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉంది' అన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 16 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు. అలాగే, వారి సమస్యలను కమిషనర్ సావధానంగా విన్నారు. అనంతరం, ఈ సమస్యలను విచారించి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ మాట్లాడుతూ... ప్రతి బుధవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని, వారి సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని కమిషనర్ తెలిపారు.

15 కిలోల బియ్యంతో కలాం చిత్రం



బియ్యంతో రూపొందించిన కలాం చిత్రం

పెరంబూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా తుంబల్‌పట్టి శంకర్ పొన్నార్ మహోన్నత పాఠశాల విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బియ్యంతో ఆయన చిత్రాన్ని రూపొందించారు. 10 అడుగుల ఎత్తు, 16 అడుగుల వెడల్పుతో రూపొందించిన ఈ చిత్రానికి 15 కిలోల బియ్యం వినియోగించారు. పాఠశాల అధ్యక్షుడు నటరాజన్, కార్యదర్శి ధర్మలింగం, కోశాధికారి ఉదయకుమార్, ప్రధానోపాధ్యాయులు రచుమరాజ్ సహా ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు విద్యార్థులను అభినందించారు.

హిజ్రాలకు దీపావళి కానుక



హిజ్రాలతో రేష్మా ఫౌండేషన్ నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని నగరంలోని రేష్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిజ్రాలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. కోడంబాక్కంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మణివన్నన్-సుందరి దంపతులు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, తమిళనాడు జూలర్ల పేరవై అధ్యక్షుడు అన్బళగన్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ కె.చంద్రమోహన్, హిజ్రాల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సుధా తదితరులు పాల్గొన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రతి ఏటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని మహిళలు, వృద్ధాశ్రమాలు, వితంతువుల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి సంక్షేమ సహాయాలను గత పదేళ్లుగా అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

22నుంచి పళనిలో కందషష్ఠి వేడుకలు



పళని దండాయుధపాణి ఆలయం

ప్యారీస్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పళని దండాయుధపాణి ఆలయంలో ఈ నెల 22న ప్రారంభం కానున్న కందషష్ఠి వేడుకలు వారం రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ప్రాతఃకాల పూజల అనంతరం మూలవర్ల కంకణధారణతో వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఆ రోజు నుండి శాయరక్ష పూజల అనంతరం బంగారు పల్లకీలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆరో రోజైన 27వ తేదీ సాయంత్రం శూరసంహార కార్యక్రమం కోసం మలైకొలుత్తు అమ్మవారి వద్ద శూలం పంపిణీ కార్యక్రమం, సాయంత్రం ఉత్తర గిరివీధిలో తారకాసురుడు, పశ్చిమ గిరివీధిలో బానాసురుడు, దక్షిణ గిరివీధిలో సింహముఖాసురుడు, తూర్పుగిరివీధిలో శూరపద్ముడు అనే రాక్షసులను బాలకుమారస్వామి వధించే శూరసంహారం జరుగుతుంది. 28వ తేదీ ఉదయం దండాయుధపాణిస్వామి ఆలయ మహామండపంలో వల్లీ,దేవసేన సమేత షణ్ముగనాధుడి తిరుకల్యాణ వైభవం జరుగుతుంది. కందషష్ఠి వేడుకల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు పళని క్షేత్రానికి వేడుకలు నిర్వహించే రోజుల్లో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నాయి.

ఉద్యోగ నైపుణ్యాలకు..

మాఫోయ్ ఫౌండేషన్‌తో అపెక్సాన్ ఒప్పందం



వొకేషనల్ సెంటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'మాఫోయ్ ఫౌండేషన్'తో బెంగళూరులోని అపెక్సాన్ సంస్థ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. బెంగళూరులోని నిరుపేద యువతకు బీఎఫ్ఎస్ఐ నైపుణ్యాలను అందించేందుకు ఈ అవగాహన కుదుర్చుకుంది.. అంతేగాక కేఆర్ పురంలోని డాన్‌బాస్కో కళాశాలలో బీఎఫ్ఎస్ఐ ఆహాన్ వొకేషనల్ సెంటర్ ప్రారంభించింది. తొలిదశలో 220 మంది నిరుపేద చివరి సంవత్సరం గ్రాడ్యుయేట్లకు బీఎఫ్ఎస్ఐ ఉద్యోగ సామర్థ్యం, నైపుణ్యత అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అపెక్సాన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సుబ్రమణ్యం తెలిపారు. మాఫోయ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ హేమలత రాజన్ మాట్లాడుతూ.. అపెక్సాన్‌తో తమ సహకారం స్థిరమైన జీవనోపాధి నిర్మించాలనే తమ దార్శనికతకు సరిపోతుందన్నారు. యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించడం ద్వారా తాము చాలామందికి ప్రకాశంతమైన భవిష్యత్తు తలుపులు తెరుస్తున్నామని వివరించారు.

'చెన్నైస్ అమృతా' విద్యార్థులకు 26 బంగారు పతకాలు



భూమినాథన్‌తో విజేతలు

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'సౌత్ ఇండియన్ క్యూలినరీ అసోసియేషన్ (సికా) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీల్లో చెన్నైస్ అమృత ఏవియేషన్ కళాశాల విద్యార్థులు స్వర్ణ పతకాల పంటపండించారు. ఆస్ట్రేలియా, సింగపూర్, మారిషస్, శ్రీలంక తదితర దేశాల నుంచి 3000 మందికి పైగా ప్రఖ్యాత పాక నిపుణులు, విద్యార్థులు పాల్గొనగా, అందులో చెన్నైస్ అమృత విద్యార్థులు 26 స్వర్ణ పతకాలు సాధించడంతో పాటు అంతర్జాతీయ న్యాయనిర్ణేతల నుంచి ప్రశంసలు అందుకున్నారు. దీనిని పురస్కరించుకుని చెన్నైస్ అమృత ఛైర్మన్ ఆర్.భూమినాథన్ విజేతలైన విద్యార్థులకు, కోచ్‌లకు రూ.15.40 లక్షల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయాలు కళాశాల కోచ్‌లు, విద్యావేత్తలు, ఇతర సిబ్బందితో సహా ప్రతి ఒక్కరి సమష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. తమ కళాశాలకు ఇన్ని స్వర్ణ పతకాలు రావడం గర్వంగా వుందని వ్యాఖ్యానించారు.

నీటివనరులను పరిరక్షించండి

● అధికారులకు కలెక్టర్ పిలుపు



అవగాహన కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటివనరులను పరిరక్షించుకోవాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులకు సూచించారు. తిరువళ్లూరులో బుధవారం ఉదయం జరిగిన 'వర్షపునీటిని ఆదా చేయండి' అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో కొలనులు, చెరువులు, నదుల నుండి వస్తున్న వర్షపునీటిని ఆదా చేయాలని, నీటివనరులను అధికారులు పరిరక్షించాలన్నారు. ప్రజలు కూడా వర్షపు నీటిని వృధా చేయకుండా ఇంటివద్దే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా నదుల నీటి ప్రవాహంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, నాలుగు రోజులపాటు పలు గ్రామాలకు వెళ్లి నీటిపై వారు పరిశోధనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెన్నై బ్రెస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో

వక్షోజ క్యాన్సర్ విజేతల భేటీ

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వక్షోజ పునర్నిర్మిత దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన చెన్నై బ్రెస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆ క్యాన్సర్ నుండి కోలుకున్న సుమారు వంద మంది మహిళలతో వక్షోజ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆ సెంటర్ సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ వెంకట్ రామకృష్ణన్, డాక్టర్ సెల్వి రాధాకృష్ణన్ ఈ వేడుకల్లో పాల్గొని ప్రసంగిస్తూ వక్షోజ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే నయం చేయవచ్చని వివరించారు. మాస్‌టెక్టోమీ ద్వారా క్యాన్సర్ సోకిన వక్షోజాన్ని పూర్తిగా తొలగించి రోగి పొత్తి కడుపు నుంచి తీసిన కొవ్వు కండరాల ద్వారా కృత్రిమ వక్షోజాన్ని రూపొందించుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా వక్షోజ క్యాన్సర్ నుంచి సంపూర్ణంగా కోలుకున్న మహిళలు తమకు జరిగిన చికిత్సా విధానాలను గురించి వివరించారు.



వక్షోజ క్యాన్సర్‌పై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకట్ రామకృష్ణన్, డాక్టర్ సెల్వి రాధాకృష్ణన్